క్లుప్తంగా

కుళాయికి ట్యాప్ ఏర్పాటు



సాక్షి స్పందన

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ 25వ డివిజన్ పరిధి శారదానగర్‌లోని కుళాయికి మేదర బస్తీకి చెందిన సామాజిక కార్యకర్త తోట శ్రీనివాస్ మరమ్మతు చేయించారు. 'సాక్షి' దినపత్రికలో వృథాగా తాగునీరు శీర్షికన గురువారం వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన శ్రీనివాస్ సొంత ఖర్చుతో జీఏ పైపునకు వెల్డింగ్ చేయించడంతోపాటు కుళాయికి ట్యాప్ పెట్టించారు.

మంత్రి పరామర్శ



లావణ్యను పరామర్శిస్తున్న మంత్రి ఈశ్వర్

ధర్మారం: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పట్టణ మహిళా అధ్యక్షురాలు దేవి లావణ్యను రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ గురువారం పరామర్శించారు. ఆమె భర్త సత్యమూర్తి మృతిచెందగా ఇంటికి వెళ్లి, ఓదార్చారు. ఆయన వెంట సహకార సంఘాల ఫోరం జిల్లా చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు బాస తిరుపతిరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొమురయ్య తదితరులున్నారు.

పొత్కపల్లిలో ఎమ్మెల్సీ..

ఓదెల: మండలంలోని పొత్కపల్లి గ్రామంలో మాచర్ల రాజమ్మ(60) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాద్‌రావు గురువారం పరామర్శించారు. ఆయన వెంట పలువురు నాయకులున్నారు.

కాంగ్రెస్ నాయకులు..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని భూంనగర్‌కు చెందిన వేల్పుల బుచ్చమ్మ ఇటీవల మృతిచెందగా ఆమె కుమారుడు వెంకన్న, ఇతర కుటుంబసభ్యులను కాంగ్రెస్ జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షుడు యాట మల్లారెడ్డి గురువారం పరామర్శించారు. ఆయన వెంట పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు సురేశ్‌గౌడ్, నాయకుడు ఆడెపు సత్యం తదితరులున్నారు.

నేడు పెద్దపల్లి సర్వసభ్య సమావేశం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ స్రవంతి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజు తెలిపారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ముఖ్య అతిథిగా వస్తున్నారని, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

క్రీడా, సాంస్కృతిక పోటీలు

మంథని: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డివిజనల్ స్థాయి జూనియర్స్ క్రీడా, సాంస్కృతిక పోటీలను గురువారం నిర్వహించారు. విజేతలకు మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ బహుమతులు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ తాహెర్ హుస్సేన్, మల్లెపల్లి సర్పంచ్ ఎరుకల తిరుపతమ్మ, కళాశాల కో–ఆర్డినేటర్ భరత్, అకాడమిక్ కో–ఆర్డినేటర్ కృష్ణ, ప్రోగ్రాం అధికారి లక్ష్మీనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

జీఎస్సార్ కప్ క్రికెట్ పోటీలు ప్రారంభం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని హనుమంతునిపేటలో గురువారం జీఎస్సార్ కప్ క్రికెట్ పోటీలను బీజేపీ నాయకుడు గొట్టిముక్కల సురేశ్‌రెడ్డి ప్రారంభించారు. నాయకులు అశోక్‌గౌడ్, శ్రీధర్, రమేశ్, చింటు, రాజు, రఘు, రవి తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలంలోని ఎల్కలపల్లిలో గురువారం ఎన్టీపీసీ ఎస్ఆర్‌సీడీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఎన్టీపీసీ వైద్యులు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ చిట్టబోయిన స్వరూప, ఉప సర్పంచ్ మేకల రాజ్‌కుమార్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు నారాయణ

రామగుండం: అంతర్గాం మండలంలోని రాయదండి గ్రామంలో డ్రెయినేజీలు, కమాన్ నిర్మాణ పనులను జెడ్పీటీసీ సభ్యుడు ఆముల నారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ధర్మాజి కృష్ణ, ఉప సర్పంచ్ తాని పవన్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు కొలిపాక శరణ్య తదితరులు పాల్గొన్నారు.



కోల్‌సిటీ: కంటి పరీక్షలు చేయించుకుంటున్న రామగుండం ఎమ్మెల్యే చందర్



మంథని: కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ మధుకర్

'కంటి వెలుగు' సందడి

సుల్తానాబాద్ పరిధిలోని సుగ్లాంపల్లి, గర్రెపల్లిలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావులు కంటి వెలుగు శిబిరాలను గురువారం ప్రారంభించారు. కమాన్‌పూర్‌లోని క్యాంపును కలెక్టర్ సంగీత పరిశీలించారు. రామగుండం నగరపాలక సంస్థ 42వ డివిజన్ కల్యాణ్‌నగర్‌లోని రాజస్థాన్‌భవన్‌లో, పాలకుర్తి మండలం బసంత్‌నగర్ వర్కర్స్ క్లబ్, పుట్నూర్ పాత పీహెచ్‌సీ భవనం, రామగుండంలోని విలేజ్ అంతర్గాంలో కంటివెలుగు శిబిరాలను రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రారంభించి, కంటి పరీక్షలు చేయించుకున్నారు. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో 3వ, 9వ, 10వ, 14వ, 19వ, 20వ, 42 డివిజన్లలో క్యాంపులు ప్రారంభించామని మేయర్ బంగి అనిల్‌కుమార్ తెలిపారు. మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని, జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ ప్రారంభించారు. కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులు సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద తొలి రోజు సందడి కనిపించింది. పలువురు వృద్ధులు కంటి పరీక్షలు చేయించుకోగా.. అవసరం అయినవారికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు.



గోదావరిఖని కంటి వెలుగు శిబిరంలో ముగ్గు వేసిన ఏఎన్‌ఎం లక్ష్మి

\- సాక్షి నెట్‌వర్క్

విద్యార్థులకు కంటి పరీక్షలు చేయాలి

• ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు

కాల్వశ్రీరాంపూర్: కంటి వెలుగు పథకంలో భాగంగా విద్యార్థులకు కంటి పరీక్షలు చేయించాలని ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు అన్నారు. గురువారం కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించారు. జెడ్పీ హైస్కూల్‌కు వెళ్లి, తరగతి గదులు, భోజనశాల, టాయిలెట్లను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా అన్ని సర్కారు బడుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. సీఎం కేసీఆర్‌తో మాట్లాడి, అన్ని పాఠశాలల్లో వ్యాయామం, క్రీడలు, మెడిటేషన్‌కు కావాల్సిన ఏర్పాట్లు చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాల రైతులకు సాగునీటి సరఫరాపై స్థానిక ప్రజాప్రతినిధులతో ఆరా తీశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఆయనను ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు వంగళ తిరుపతి రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు శాలువాలతో సత్కరించారు. వైస్ ఎంపీపీ శిరీష, ఎంపీడీవో రామ్మోహనాచారి, ఎంపీవో గోవర్ధన్, పీఆర్ ఏఈ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



హైస్కూల్‌లో పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు

బాల్య మిత్రుడి కుటుంబానికి చేయూత

జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంటకు చెందిన కొత్త రాములు మూడు నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న 1990–91లో అతనితో కలిసి పదోతరగతి చదివిన బాల్య మిత్రులు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. రూ.50 వేలు జమ చేసి, గురువారం రాములు కూతురి ఉన్నత చదువుల కోసం బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. సంబంధిత బాండ్‌ను అతని భార్య భవానికి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సంతోశ్‌రావు, ఎంపీటీసీ సభ్యుడు మల్లేశం, కుంట రాజేశ్వర్‌రెడ్డి, రాములు స్నేహితులు పర్శరాం, శ్రీనివాస్, చంద్రమౌళి, లక్ష్మణ్, స్వరూప, సరళ తదితరులు పాల్గొన్నారు.

'స్ఫూర్తి' పాఠశాలకు...

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని బండారికుంటలో గల స్ఫూర్తి మానసిక దివ్యాంగుల పాఠశాలకు గోదావరిఖని క్రెడిట్ సొసైటీ వారు చేయూతనందించారు. గురువారం 4 ర్యాకులు, 4 సీలింగ్ ఫ్యాన్లు, 2 కూలర్లు, 25 కిలోల వంట పాత్రలు అందించారని పాఠశాల నిర్వాహకుడు శ్రీనివాస్ తెలిపారు. క్రెడిట్ సొసైటీ అధ్యక్షుడు శ్రీధర్‌రావు, నాసిర్ అహ్మద్, అశోక్, రాంనారాయణ తదితరులున్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న మిత్రులు

కిడ్నీ వ్యాధి బాధితుడికి ఆర్థికసాయం



నగదు అందిస్తున్న యువకులు



డబ్బులు అందిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

పాలకుర్తి: మండలంలోని పుట్నూర్ గ్రామానికి చెందిన పొన్నం రాము కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధ పడుతున్నాడు. వైద్య ఖర్చులకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు అతని మిత్రుల ద్వారా తెలుసుకున్న పెద్దపల్లికి చెందిన సంపత్, పిడుగు సతీశ్ అనే యువకులు వాట్సాప్ గ్రూప్ ద్వారా విరాళాలు సేకరించారు. మొత్తం రూ.12 వేలను గురువారం రాము ఇంటికి వెళ్లి, అందజేశారు. కార్యక్రమంలో పుట్నూర్ గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వేల్పుల రాజ్‌కుమార్, మేకల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

లారీడ్రైవర్ కుటుంబానికి..

సుల్తానాబాద్: పట్టణంలోని శాస్త్రినగర్‌కు చెందిన లారీడ్రైవర్ వెంకట్ నాయక్ ఇటీవల మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి లారీ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘం గౌరవ అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ గురువారం రూ.48 వేలు అందజేశారు. భవిష్యత్తులో వెంకట్ నాయక్ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. పట్టణంలోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కంకణాల తిరుపతి, కార్యదర్శి తిరుపతిరెడ్డి, లారీ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మజారుద్దీన్, నాయకులు క్యాదశి శంకర్, ఆసంపల్లి తిరుపతి, మాతంగి శంకర్, నల్ల పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలపై అవగాహన

పాలకుర్తి: మండలంలోని జయ్యారం గ్రామంలో పోస్టల్ పథకాలపై గ్రామస్తులకు గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేల్ ఓవర్సీస్ పోచయ్య, బ్రాంచి పోస్టుమాస్టర్ హరీశ్‌నాయక్, సిబ్బంది అఖిల్, వినయ్, మల్లేశం, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రామగుండం: పోస్టల్ పొదుపు పథకాలు సురక్షితమని, కార్పొరేట్ బ్యాంకుల కంటే అధిక వడ్డీ, నమ్మకం, లాభం కలిగి ఉంటాయని కుందనపల్లి పోస్టల్ సిబ్బంది అన్నారు. గురువారం గ్రామంలో పొదుపు పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సిబ్బంది రవితేజ, మాడిశెట్టి శ్రీకాంత్, ఆనంద్ తదితరులున్నారు.

శ్రీవారి సేవలో కాలనీ మహిళలు



యైటింక్లయిన్‌కాలనీ: తిరుమల తిరుపతి దేవస్థానంలో సేవ చేసేందుకు యైటింక్లయిన్ కాలనీ మహిళలు తరలివెళ్లారు. సంతోషిమాత సేవా బృందం 30 మంది ఈ నెల 30 వరకు అక్కడే ఉండనున్నారు. వెళ్లిన వారిలో గండి వసంత లక్ష్మి, కాల్వ లక్ష్మి, రమాదేవి, రోజా, లత, స్వప్న, మంజుల, సత్యవతి, వనిత, పద్మ తదితరులున్నారు.

బీఎస్పీ కోటి సంతకాల సేకరణ



జూలపల్లి: వెనకబడిన తరగతుల వారికి రిజర్వేషన్ పెంచాలని కోరుతూ బీఎస్పీ ఆధ్వర్యంలో గురువారం జూలపల్లి మండలంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తోట వెంకటేశ్ పటేల్ మాట్లాడుతూ.. బీసీలకు ప్రస్తుతం ఉన్న 27 శాతం రిజర్వేషన్‌ను వెంటనే 52 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట జిల్లా కోశాధికారి గడ్డం శేషాద్రి, అసెంబ్లీ కోశాధికారి తోట మధు తదితరులున్నారు.

'ధరణి' శిక్షణ తరగతులకు మాజీ ఎమ్మెల్యే హాజరు

పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ధరణి పోర్టల్ శిక్షణ తరగతులకు మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు గురువారం హాజరయ్యారు. రైతాంగం ఈ పోర్టల్‌తో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన వివరించారు. పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని రైతులకు దీనిపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

పంటల పరిశీలన



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి శ్రీకాంత్

ముత్తారం: మండలంలోని ఇప్పలపల్లి గ్రామంలో వ్యవసాయాధికారి చిందం శ్రీకాంత్ గురువారం పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వరిలో కాయ తొలుచు పురుగులను గుర్తించారు. నివారణకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరానికి 10 కిలోల చొప్పున, క్లోరాంత్రినిలిప్రోల్ 4 కిలోలు చల్లాలని సూచించారు. ఆయన వెంట ఏఈవో మౌనిక తదితరులున్నారు.

అంతర్గాం మండలంలో..

రామగుండం: అంతర్గాం మండలంలోని పలు గ్రామాల్లో వరి పంటలను ఏవో భూక్య రాంబాబు, ఏఈవో రమేశ్‌లు గురువారం పరిశీలించారు. వరిలో కాండం తొలుచు పురుగు, జింకు లోప లక్షణాలను గుర్తించామన్నారు. కాండం తొలుచు పురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు చల్లాలన్నారు. జింకు లోప నివారణకు నారు, లేదా ప్రధాన మడిలో రెండు గ్రాముల జింక్ సల్ఫేట్‌ను లీటర్ నీటిలో కలిపి అవసరం మేరకు ఒకటి, రెండు సార్లు పిచికారీ చేయాలని చెప్పారు.

జూలపల్లి మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశం

జూలపల్లి: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ కమిటీ పాలకవర్గ ఆఖరి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ నెల 23తో కమిటీ పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో స్వీట్లు పంపిణీ చేశారు. కమిటీ చైర్మన్ కంది చొక్కారెడ్డి మాట్లాడుతూ.. తన పదవీ కాలంలో తనకు సహకరించిన డైరెక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. వైస్ చైర్మన్ లోక రవీందర్‌రెడ్డి, డైరెక్టర్లు రాజేశం, తొగరు శ్రీనివాస్, మార్కెట్ కార్యదర్శి సరోజన, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శికి సన్మానం



తారిఖ్ అన్వర్‌ను సన్మానిస్తున్న సంజీవరెడ్డి, బాబర్ సలీంపాషా, నాయకులు

జ్యోతినగర్: ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి తారిఖ్ అన్వర్‌ను ఐఎన్టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి, కార్యదర్శి బాబర్ సలీంపాషాలు గురువారం సన్మానించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడమే తమ యూనియన్ ఎజెండా అని, రానున్న రోజుల్లో వారి హక్కుల సాధనకు ఉద్యమిస్తామని పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లోని ఐఎన్టీయూసీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

లఘుచిత్రం సీడీ ఆవిష్కరణ



సీడీ ఆవిష్కరిస్తున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖనిటౌన్: గోదావరిఖనికి చెందిన షార్ట్ ఫిలిం డైరెక్టర్ మహేశ్ గొట్టె రూపొందించిన నందిని లఘుచిత్రం యువతకు ఆదర్శమని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి అన్నారు. స్థానిక రేయిన్‌బో స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంబంధిత సీడీని ఆవిష్కరించారు. మేజిక్ రాజా, సింగరేణి–2, 2ఎ గని డిప్యూటీ మేనేజర్ మాధవరెడ్డి, స్వచ్ఛంద సంఘాల సలహాదారు దయానంద్‌గాంధీ, స్కూల్ కరస్పాండెంట్ అమరేందర్‌రావు, నటీనటులు సంజయ్‌రాజ్, మనీష, సిరిశెట్టి తిరుపతిగౌడ్, మూల శంకర్, రహీం తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు అవకాశం

• ఓదెల జెడ్పీటీసీ సభ్యుడు గంట రాములు



మాట్లాడుతున్న రాములు

పెద్దపల్లిరూరల్: శాసనసభ ఎన్నికల్లో బీసీ కులాలకు చెందిన నాయకులకు పోటీ చేసే అవకాశాన్ని కాంగ్రెస్ అధిష్టానం కల్పిస్తుందని ఓదెల జెడ్పీటీసీ సభ్యుడు గంట రాములు, మాజీ ఎంపీపీ వేముల రామ్మూర్తిలు ఆశాభావం వ్యక్తం చేశారు. పెద్దపల్లిలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ అధిష్టానం ప్రతీ పార్లమెంట్ పరిధిలో రెండు అసెంబ్లీ సీట్లను బీసీలకు కేటాయిస్తామన్న సంకేతాలను ఇచ్చిందని పేర్కొన్నారు. పెద్దపల్లి టికెట్‌ను బీసీలకే ఇవ్వాలని కోరతామన్నారు. జనాభాలో అధికశాతం ఉన్న బీసీలను గుర్తించేందుకు ప్రభుత్వం బీసీ గణన చేయాలన్నారు. ఈ నెల 26 నుంచి మొదలయ్యే హాత్ సే హాత్ జోడో యాత్రను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు రఫియుల్లా ఖాన్, గ్యారవేని రమేశ్, వేల్పుల ఐలయ్య, రేగుల తిరుపతి, రవి తదితరులున్నారు.

ఎస్‌సీసీడబ్ల్యూయూ మహాసభలకు తరలిరండి

రామగిరి: ఈ నెల 29న కొత్తగూడెంలో జరిగే ఎస్‌సీసీడబ్ల్యూయూ రాష్ట్ర ఏడో మహాసభలకు తరలిరావాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న కోరారు. గురువారం ఆర్జీ–3 ఏరియాలోని ఓసీపీ–1, 2, ఎస్ఎంఎస్ ప్లాంట్‌లలో కాంట్రాక్టు కార్మికులను కలిసి, సంబంధిత పోస్టర్ ఆవిష్కరించారు. ఈ మహాసభలు భవిష్యత్తు పోరాటాలకు నాంది పలకబోతున్నాయని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి, సింగరేణి శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా సభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, శేఖర్, రాజేశం, రవి, ఓదెలు, శ్రీనివాస్, పద్మ, లక్ష్మి, లలిత, శ్యామ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వెంకన్న, నాయకులు

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి

యైటింక్లయిన్‌కాలనీ: ఈ నెల 29న కొత్తగూడెంలో నిర్వహిస్తున్న ఎస్‌సీసీడబ్ల్యూయూ 7వ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ కోరారు. గురువారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ జోన్–2 కాంట్రాక్టు కార్మికులతో కలిసి సంబంధిత వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. నాయకులు లింగయ్య, రాజేశ్వరి, నాగరాజు, రాయమల్లు తదితరులున్నారు.

ఇంకుడు గుంతలు తవ్వుకోవాలి

రామగిరి: ఇంటింటికీ ఇంకుడు గుంతలు తవ్వుకోవాలని, వీటివల్ల జల వనరులను కాపాడుకోవచ్చని ఓసీపీ–1 పీవో రాధాకృష్ణ అన్నారు. సింగరేణి ఆధ్వర్యంలో గుంతలు తవ్విస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం రత్నాపూర్‌లో పనులు ప్రారంభించారు. సర్పంచ్ ప్రతిమ, అధికారులు జీఎం రఘుపతి, ఎండీ షఫీ, పద్మరాజు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



ఇంకుడు గుంత పనులు ప్రారంభిస్తున్న ఓసీపీ–1 పీవో రాధాకృష్ణ

నేత్రదాత కుటుంబానికి ప్రశంసాపత్రం అందజేత

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ పోతన కాలనీకి చెందిన తిరుమల్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. కుటుంబసభ్యులు ఆయన నేత్రాలను దానం చేశారు. గురువారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తిరుమల్‌రెడ్డి సంస్మరణ సభలో సంస్థ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి నేత్రదాత కుటుంబసభ్యులకు ప్రశంసాపత్రం అందజేశారు. టీబీజీకేఎస్ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్, ఎస్ఎంఎస్ ప్లాన్ ప్రాజెక్టు ఆఫీసర్ రమేశ్, సత్యనారాయణ రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



రోజువారీ సంతకు మోక్షమెప్పుడో?



మార్కెట్ కోసం కేటాయించిన స్థలంలో నిర్మించిన షెడ్లు

• 2017లో యైటింక్లయిన్‌కాలనీలో మార్కెట్ పనులు ప్రారంభం
• రూ.65 లక్షలు మంజూరైనా అందుబాటులోకి రాలే..
• మందుబాబులకు అడ్డాగా మార్కెట్ షెడ్లు

యైటింక్లయిన్‌కాలనీ: ప్రజలకు తాజా కూరగాయలు అందాలని యైటింక్లయిన్ కాలనీలో రోజువారీ సంత ఏర్పాటుకు నిర్ణయించారు. స్థానిక తెలంగాణ చౌరస్తా వాటర్ ట్యాంక్ వద్ద స్థలం కేటాయించారు. మార్కెట్ యార్డు నిర్మాణాలు చేపట్టేందుకు 2017లో రూ.65 లక్షలు మంజూరవగా అప్పటి ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ శంకుస్థాపన చేసి, పనులు ప్రారంభించారు. కానీ మధ్యలోనే ఆగిపోయాయి. ప్రస్తుత ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తిరిగి ప్రారంభించగా షెడ్లు నిర్మించి, వదిలేశారు. ఎలాంటి సదుపాయాలు కల్పించలేదు. మందుబాబులు రాత్రీ పగలు అనే తేడా లేకుండా మార్కెట్ షెడ్లలోనే మద్యం సేవిస్తున్నారు. అక్కడే మూత్ర విసర్జన చేస్తుండటంతో అటుగా వెళ్లే మహిళలు, స్కూల్ పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, కాంట్రాక్టర్లు, పాలకుల నిర్లక్ష్యంతో పనుల్లో జాప్యం జరుగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. కూరగాయల కొనుగోలుకు ఇబ్బంది పడుతున్నామని, ఎమ్మెల్యే చందర్, మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక చొరవ తీసుకొని, డైలీ మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు పూర్తి చేయాలి



మార్కెట్ లేకపోవడంతో తాజా కూరగాయలు కావాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి, మార్కెట్ పనులను త్వరగా పూర్తి చేయాలి. – భాగ్యలక్ష్మి, యైటింక్లయిన్‌కాలనీ

వినియోగంలోకి తీసుకురావాలి



నిధులు మంజూరైనా మార్కెట్ పనులు పూర్తి చేయకపోవడం బాధాకరం. ప్రజాప్రతినిధులు, అధికారులు సంతను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలి.
– గుండేటి రాజేశ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, యైటింక్లయిన్‌కాలనీ

మూడు నెలల్లో అందుబాటులోకి..



మార్కెట్ నిర్మాణ పనుల్లో కొంత జాప్యం జరిగిన మాట వాస్తవమే. పూర్తి వివరాలు తెలుసుకొని, మిగిలిన పనులు పూర్తి చేస్తాం. మరో మూడు నెలల్లో డైలీ మార్కెట్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం. – సుమన్‌రావు, మున్సిపల్ కమిషనర్, రామగుండం